తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
13 జూన్ 2026
పేజీలు : 08



# ఫార్మాసిటీ భూసేకరణలో తీరని అన్యాయం

## పరిహారం కోసం పదేళ్లు తిరిగి ప్రాణాలు విడిచిన చిన్న కిష్టయ్య

- ‘నో పొజిషన్’ నెపంతో న్యాయం నిరాకరణ
- కడీలు కూల్చి భూమి చదును చేసిన అధికారులు
- తక్షణం పరిహారం ఇవ్వాలని కలెక్టర్‌కు కుటుంబం విన్నపం





**యాచారం, జూన్ 12 (జనం సాక్షి):** యాచారం మండలం కురిమిద్ద గ్రామంలో ఫార్మాసిటీ భూసేకరణ బాధితులకు జరుగుతున్న అన్యాయానికి ఒక వృద్ధ రైతు ప్రాణాలు కోల్పోయే వరకు విషయం చేరింది. గ్రామానికి చెందిన మల్కాపురం చిన్న కిష్టయ్య (తండ్రి: లచ్చయ్య) సర్వే నెంబర్ 264లోని 3 ఎకరాల 20 గుంటల అసైన్డ్ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 2016లో ఫార్మాసిటీ భూసేకరణ సమయంలో రెవెన్యూ అధికారులు ఎలాంటి ఆర్ఐ పంచనామా నిర్వహించకుండా, ఏకపక్షంగా ‘నో పొజిషన్’ అనే కారణంతో పరిహారం చెల్లించకుండా నిరాకరించారు.

భూమిపై పూర్తి హక్కు కలిగి, నిరంతరం సాగు చేస్తున్నప్పటికీ గత పదేళ్లుగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్‌డీఓ, యాచారం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పలు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి స్పందన రాలేదు. అధికారుల నిర్లక్ష్యం, కాలయాపన వల్ల తీవ్ర మనోవేదనకు గురైన వృద్ధ రైతు ఇటీవల కన్నుమూశారు. పరిహారం కోసం కుటుంబ పెద్దను కోల్పోయి ఇప్పటికే శోకసాగరంలో మునిగిన కుటుంబానికి మరో గుండెపోటు ఇచ్చినట్లు మారింది. వారం రోజుల క్రితం టీజీఐఐసీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది భారీ పోలీస్ బందోబస్తుతో వచ్చి పరిహారం చెల్లించని ఆ భూమి చుట్టూ ఉన్న కడీలను కూల్చివేసి భూమిని చదును చేశారు. తమకు తక్షణం ఫార్మా పరిహారం ప్రకటించి న్యాయం చేయాలని, లేని పక్షంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు హెచ్చరికలు ఇస్తూ విన్నవించుకున్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల వేగవంతమైన స్పందన

- బీరప్పగడ్డలో రహదారి భద్రతా చర్యలు త్వరితం
- ఇర్షాద్ ఖాన్ వినతిపత్రంపై కమిషనర్ ఆదేశాలు
- విద్యార్థుల భద్రత, గుంతలు, మురుగునీటి మూతల మరమ్మతు
- ప్రజల సమస్యలకు సానుకూల స్పందన




లోపలి పేజీలో

## పేదల జనగణన విస్మరించడం రాజ్యాంగ విరుద్ధం!

- ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌కు సీపీఐ నాయకుల వినతి
- కుంట్లూరు రావి నారాయణ రెడ్డి కాలనీ వాసులకు న్యాయం చేయాలని డిమాండ్





## ఫేక్ ఈ-మెయిల్ వ్యవహారం

### పోలీసుల దర్యాప్తులో ఇండస్ కోఆర్డినేటర్ వంగాల వెలుగులోకి శంకర్ రెడ్డి అక్రమాలు

**హయత్ నగర్, జూన్ 12 (జనం సాక్షి) :** ప్రభుత్వ సంస్థల పేరుతో నకిలీ ఈ-మెయిల్ ఐడీలను సృష్టించి, వొకేషనల్ ట్రైనర్స్‌కు సంబంధించిన సమాచారాన్ని చేరవేస్తున్న ముఠా గుట్టును ఎల్‌బీనగర్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఇండస్ వొకేషనల్ కోఆర్డినేటర్ వంగాల శంకర్ రెడ్డి తన తప్పును అంగీకరిస్తూ పోలీసుల ఎదుట లిఖితపూర్వకంగా ఒప్పుకోవడం సంచలనం సృష్టిస్తోంది. కేసు వివరాలు నమ్మదగిన సమాచారం ప్రకారం, నిందితుడు వంగాల శంకర్ రెడ్డి “rtitelangana01@gmail.com’ అనే నకిలీ (ఫేక్) ఈ-మెయిల్ ఐడీని సృష్టించాడు. దీని ద్వారా ప్రభుత్వ అధికారిక సమాచారంగా భ్రమింపజేస్తూ వొకేషనల్ ట్రైనర్స్‌కు సంబంధించిన కీలక వివరాలను అక్రమంగా పంపినట్లు దర్యాప్తులో తేలింది. దీనిపై బాధితులు ఎల్‌బీనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో లోపలి పేజీలో

## మున్సిపల్ భూమి ఆక్రమణపై కౌన్సిలర్‌లు కమిషనర్‌కు ఫిర్యాదు

లోపలి పేజీలో



## సాంకేతిక వ్యవసాయానికి అగ్రి వర్సిటీ దిక్సూచి కావాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**రాజేంద్రనగర్, జూన్12(జనంసాక్షి) :** వ్యవసాయ రంగం సాంకేతికత, విలువ ఆధారిత విధానాల దిశగా ముందుకు సాగాలని, అందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం దిక్సూచిగా నిలవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం రాజేంద్రనగర్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా “భారత హరిత విప్లవంలో ఇందిరాగాంధీ విశేష సేవలు” అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సాంకేతికత, విలువ ఆధారిత వ్యవసాయానికి విశ్వవిద్యాలయం దిక్సూచిగా నిలవాలని అన్నారు. డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెన్సార్ ఆధారిత వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు మరింత విస్తరించాలని సూచించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, హరిత విప్లవం ద్వారా దేశం ఆహార స్వావలంబన సాధించడంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్ర కీలకమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారానికి విశ్వవిద్యాలయాలు మరింత కృషి చేయాలని లోపలి పేజీలో

# హైటెక్స్‌లో పారిశ్రామిక ఎక్స్‌పో ప్రారంభం

## ఇండోమాచ్ 'బీ2బీ ఇండస్ట్రియల్ మెషినరీ, ఇంజనీరింగ్ ఎక్స్‌పో'



**హైదరాబాద్, జూన్ 12 (జనంసాక్షి) :** దక్షిణ భారతదేశంలో అత్యంత కీలకమైన పారిశ్రామిక సదస్సులలో ఒకటిగా నిలిచే మూడు రోజుల 'ఇండోమాచ్ హైదరాబాద్ 2026' బీ2బీ ఇండస్ట్రియల్ మెషినరీ �do ఇంజనీరింగ్ ఎక్స్‌పో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లోని హాల్ నెంబర్ 1లో ఈరోజు ప్రారంభమైంది. ఈనెల 14వ తేదీ వరకు జరగనుంది. సందర్శకులకు ప్రవేశం ఉచితం. ఈ ఎక్స్‌పో సందర్శన సమయం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6:30 వరకు ఉంటుంది. ఈ సందర్భంగా తెలంగాణ ఇండస్ట్రియలిస్ట్స్ ఫెడరేషన్ (హైదరాబాద్) ప్రెసిడెంట్ కే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటన్నారు. ఇది పారిశ్రామిక వృద్ధికి అపారమైన అవకాశాలను అందిస్తోందన్నారు. ముఖ్యంగా 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి పారిశ్రామికీకరణ వేగం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇది భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులకు మన రాష్ట్రాన్ని ఒక అగ్రగామి గమ్యస్థానంగా మార్చిందన్నారు. తపారియా టూల్స్ లిమిటెడ్ (ముంబై) జనరల్ మేనేజర్ బీ పిళ్ళై మాట్లాడుతూ తపారియా టూల్స్ భారతదేశంలోనే అగ్రగామి హ్యాండ్ టూల్స్ తయారీ సంస్థ అన్నారు. ఇండోమాచ్ డైరెక్టర్ మనీష్ సిన్హా మాట్లాడుతూ ఇండోమాచ్ హైదరాబాద్‌కు ఇది ఐదవ ఎడిషన్ అన్నారు. దీని ద్వారా దేశ నలుమూలల నుంచి 100కు పైగా ప్రముఖ కంపెనీలు ఒకే చోటకు వచ్చాయన్నారు. తయారీదారులు, డీలర్లు, పంపిణీదారులు, పరిశ్రమ నిపుణులు ఒకరితో ఒకరు అనుసంధానం కావడానికి, సరికొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించడానికి, అత్యాధునిక ఉత్పత్తులు, సాంకేతికతలను ప్రదర్శించడానికి ఈ ఎక్స్‌పో ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తుందన్నారు. ఈ ప్రదర్శన అటు ఎగ్జిబిటర్లకు, ఇటు సందర్శకులకు ఎంతో విలువైనదిగా నిలుస్తుందని అన్నారు.

అర్థవంతమైన భాగస్వామ్యాలకు, వ్యాపార వృద్ధికి తోడ్పడుతుందని నమ్ముతున్నామన్నారు. తెలంగాణ ఇండస్ట్రియలిస్ట్స్ ఫెడరేషన్ (హైదరాబాద్) ప్రెసిడెంట్ కే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. గౌరవ అతిథులుగా ఐఏఎల్ఏ, సీఐఈ గాంధీనగర్ చైర్మన్ పీ స్వామి గౌడ్, తపారియా టూల్స్ లిమిటెడ్, ముంబై జనరల్ మేనేజర్ బీ పిళ్ళై, చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యదర్శి పీఎస్ మోహన్, ఇండోమాచ్ డైరెక్టర్లు సుధీర్ భోలే, మనీష్ సిన్హా, సచిన్ శర్మ, సుమిత్ పోర్వాల్ పాల్గొన్నారు.

# నగరంలో 'వరల్డ్ ఈవెంట్స్ ఎకానమీ వీక్ 2026' ప్రారంభం

## గ్లోబల్ ఈవెంట్‌కు భాగ్యనగరం ఆతిథ్యం




**హైదరాబాద్, జూన్ 12 (జనంసాక్షి) :** గ్లోబల్ ఈవెంట్స్ రంగంలో సరికొత్త మైలురాయిగా నిలిచే 'వరల్డ్ ఈవెంట్స్ ఎకానమీ వీక్ (డబ్ల్యుఈఈడబ్ల్యు) 2026' ప్రారంభోత్సవానికి భాగ్యనగరం వేదికైంది. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో ఈ రోజు ప్రారంభమైంది. 15వ తేదీ వరకు జరగనుంది. ఈ అంతర్జాతీయ సదస్సును తెలంగాణ టూరిజం భాగస్వామ్యంతో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ), హైటెక్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ వాణి ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక పర్యాటక ప్రాంతాలను కేవలం అక్కడకు వచ్చే పర్యాటకుల సంఖ్యను బట్టి కాకుండా కాన్ఫరెన్స్‌లు, ఎగ్జిబిషన్‌లు, కార్పొరేట్ ఈవెంట్‌లు, డెస్టినేషన్ వెడ్డింగ్స్, సాంస్కృతిక ఉత్సవాలు, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించగల సామర్థ్యాన్ని బట్టి అంచనా వేస్తుండటమే ఈ వేదికకు ఇంతటి ప్రాధాన్యత వచ్చిందన్నారు. ఈ ఈవెంట్‌లు సందర్శకుల భాగస్వామ్యాన్ని పెంచేవిగా, పర్యాటక ప్రాంతాల బ్రాండ్ విలువను బలపరిచేవిగా ఉండటమే కాకుండా హాస్పిటాలిటీ, పర్యాటకం, రవాణాలో దీర్ఘకాలిక విలువను సృష్టించే శక్తివంతమైన ఆర్థిక చోదకాలుగా పని చేస్తాయన్నారు. ఇది ముఖ్యంగా తెలంగాణకు ఎంతో సందర్భోచితమైనదన్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, మూసి నది అభివృద్ధి సంస్థ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పీ గౌతమి మాట్లాడుతూ వెడ్డింగ్ ఇండస్ట్రీని సంకుచిత దృక్పథంతో చూడకూడదన్నారు. 'వివాహం' కేవలం ఒక రోజు జరిగే వేడుక కాదన్నారు. డబ్ల్యుఈఈడబ్ల్యు చైర్మన్, హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హెడ్ శ్రీకాంత్ టీజీ మాట్లాడుతూ ఇది కేవలం ఒక ఈవెంట్ మాత్రమే కాదన్నారు. ఇది సహకారం, వ్యాపార వృద్ధి, ఆవిష్కరణల కోసం కొత్త అవకాశాలను సృష్టించడానికి ఈవెంట్స్ ఎకానమీకి చెందిన బహుళ రంగాలను ఒకే చోటకు చేర్చే ఒక గొప్ప వేదిక అన్నారు. ఈ ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ప్రపంచ స్థాయి ప్రదర్శనలను, పారిశ్రామిక వేదికలను అందించగల గమ్యస్థానంగా హైదరాబాద్ స్థానం మరింత బలోపేతం అవుతుందన్నారు.




# ఘనంగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఆసిఫ్ అలీ జన్మదిన వేడుకలు

## రేవంత్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకల నిర్వహణ

**కడ్తాల్, జూన్12 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఆసిఫ్ అలీ జన్మదిన వేడుకలను రేవంత్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో నాయకులు,కార్యకర్తలు,అభిమానుల మధ్య ప్రత్యేకంగా తయారు చేసిన కేకును కోసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.అనంతరం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి నాయకులు మాట్లాడారు.ఆసిఫ్ అలీ ప్రజా సేవ,సామాజిక కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని నాయకులు కొనియాడారు.ఈ సందర్భంగా ఆసిఫ్ అలీ మాట్లాడుతూ..నాపై అభిమానం ప్రేమ ఆప్యాయత ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని అభిమానులకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ప్రజా సేవలో మరింత చురుకుగా పనిచేస్తానని అన్నారు.వేడుకల సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని అందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్,రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్,డిసిసి అధికార ప్రతినిధి గూడూర్ శ్రీనివాస్ రెడ్డి,రేవంత్ మిత్ర మండలి సభ్యులు ఆనంద్,గుర్రం కేశవులు,వివిధ గ్రామాల సర్పంచులు బిక్షపతి,చీపునుంతల సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆశన్న,మహేందర్ గౌడ్,బాలరాజ్,ఉటు మహేందర్,ఉప సర్పంచులు యాదగిరి రెడి,దళపతి గౌడ్,మాజీ సర్పంచులు తాజా మాజీ వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు,రేవంత్ మిత్రమండలి సభ్యులు అభిమానులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# వెలిజర్ల గ్రామంలో పోచమ్మ ఆలయానికి రవీందర్ యాదవ్ ఆర్థిక సహాయం



**ఫరూఖ్‌నగర్ (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో జరుగుతున్న పోచమ్మ దేవాలయ నిర్మాణ పనులకు షాద్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ రూ. 20,116/- ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచనల మేరకు ఈ విరాళాన్ని అందజేసిన రవీందర్ యాదవ్, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అండగా నిలుస్తూ ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు రవీందర్ యాదవ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధి, ధార్మిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ముందుండే వారి సేవలను వారు అభినందించారు.

# మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం



**శంకర్ పల్లి జూన్ 12(జనం సాక్షి) :** మొకిల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఈగల్ టీమ్ సమక్షంలో డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించి మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో భాగంగా వ్యాపార దుకాణాలు మరియు ఇతర ప్రజా ప్రదేశాలను సందర్శించి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించబడింది.అలాగే ఫ్యూచర్ సిటీ కమిషనరేట్కు చెందిన నార్కోటిక్స్ డిటెక్షన్ డాగ్ (తేజ) దాని హ్యాండ్లర్ శ్రీ కె.ఆంజనేయులు, ఆర్ఎస్ఐ రాము మరియు మోకిల ఎస్సై పద్మ సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. అక్రమంగా మాదక ద్రవ్యాల విక్రయం,నిల్వ, రవాణా లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని దుకాణదారులు, ప్రజలకు సూచించబడింది.

# రాష్ట్ర బహిరంగ సభను జయప్రదం చేయండి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప



**యాలాల జూన్ 12 (జనంసాక్షి) :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహాసభలు మహబూబ్ నగర్ లో ఈ నెల 20,21,22 తేదీలల్లో జరుగుతున్నాయని సభలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప పిలుపునిచ్చారు.శుక్రవారం యాలాల మండల పరిధిలోని కమాల్ పూర్ గ్రామం లో కూలీలతో కలిసి మహాసభల కరపత్రం ఆవిష్కరించారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ వలసలకు నిలయమైన పాలమూరు జిల్లాలో రాష్ట్ర మహాసభలను అత్యంత ప్రతిష్టశీగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ హాజరు అవుతారని, రాష్ట్ర నలుమూలల నుండి ప్రతినిధులు మరియు పక్క ఐదు రాష్ట్రల ముఖ్య నాయకులు పాల్గొనడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ మహాసభలకు పార్టీలకు అతితంగా సహకరించాలని అన్నారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక,కర్షక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుదని అన్నారు.కేంద్రం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను తొలిగించి ,కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్స్ లను తీసుకురావడం జరిగిందని అన్నారు.పేద మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి మూలంగా ఉన్న ఉపాధిహామీ చట్టాన్ని పేరు మార్చి బీవీజీ రామ్ జీ పేరుతో పేదలను, కూలీలను ఉపాధి కూలీకి దూరం చేస్తున్నారు.గతంలో90శాతంనిధులు కేటాయించే కేంద్రం ప్రభుత్వం నేడు కేవలం 60శాతం నిధులు కేటాయింస్తామని మిగితా 40శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించుకోవాలని చెప్పడం సిగ్గుచెట్టన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం రాబోయే కాలంలో పెద్దఎత్తున పోరాటాలు చేయడానికి ఈ మహాసభలు పునాదిగా మారుతాయని పేర్కొన్నారు.

## ఆర్టీసీ జేఏసీ సింగిల్ డిమాండ్

### ఆర్టీసీ ఉద్యోగులను ముందుగా ప్రభుత్వంలో విలీనం చేయాలి




**ముషీరాబాద్, జూన్ 12 (జనంసాక్షి):** ఆర్టీసీ కార్మిక సంఘాలకు ముందుగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. ముందుగా విలీనం చేయాలనే సింగిల్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి, కన్వీనర్ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, యాదగిరి లు పాల్గొని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... మే 1 న స్వయంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ముందు విలీనం కావాలా? లేక ఎన్నికలు కావాలా? ఏది ముందు కావాలో అని కార్మిక సంఘాలు వ్రాసి ఇవ్వాలని ఆదేశించారని గుర్తు చేస్తూ... వారి సూచన మేరకు ఎలక్షన్ కంటే ముందు విలీనం చేయాలని కోరుతూ వినతి పత్రాలు అన్ని సంఘాలు అందించాయని అన్నారు. దీనికిగాను ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకొని అన్ని కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించాలని కార్మిక సంఘాల అభిప్రాయం గౌరవించి వెంటనే అపాయింటెడ్ డేట్ ప్రకటన విడుదల చేయాలని జేఏసీ నాయకులు కోరారు.

## విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలన్నదే లక్ష్యం : ఎమ్మెల్యే మల్లారెడ్డి

**శామీర్ పేట్, జూన్ 12(జనం సాక్షి )**



పేద మధ్యతరగతి విద్యార్థులకు కూడా అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందించడమే నా లక్ష్యమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్ గడి మలక్ పేట్ లో నూతన సీఎంఆర్ పాఠశాలను ఎమ్మెల్యే మల్లారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నన్ను ఆదరించి ఓటు వేసిన మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, వారి బంగారు భవిష్యత్తుకు మంచి విద్యను అందించేందుకు పాఠశాలలు, కళాశాలలో ఏర్పాటు చేస్తున్నానని చెప్పారు. అతి తక్కువ ఫీజులతో విద్యార్థులకు మంచి విద్యను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కంతం శిరీష కృష్ణారెడ్డి, వైస్ చైర్ పర్సన్ మాలతి, మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సి పాలిటీల కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉప్పల్ లో స్కైవాక్ లిఫ్ట్‌లో సాంకేతిక లోపం

### గంటలపాటు బందీగా యువకుడు

**ఉప్పల్, జూన్ 12 (జనం సాక్షి):** ఉప్పల్ స్కైవాక్‌లోని లిఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఓ యువకుడు గంటలపాటు అందులోనే చిక్కుకుపోయిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనతో ప్రయాణికులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన రాహుల్ (29) ఉప్పల్‌లో నివాసం ఉంటూ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. విధులు ముగించుకుని హాస్టల్‌కు వెళ్తున్న క్రమంలో స్కైవాక్‌లోని లిఫ్ట్‌ను వినియోగించాడు. అయితే లిఫ్ట్ కిందికి వస్తుండగా అకస్మాత్తుగా పనిచేయడం నిలిచిపోవడంతో మధ్యలోనే ఆగిపోయింది. దీంతో రాహుల్ లిఫ్ట్‌లోనే చిక్కుకుపోయాడు. కొంతసేపు వేచి చూసినా లిఫ్ట్ కదలకపోవడంతో అతడు తన మొబైల్ ఫోన్ ద్వారా స్నేహితులకు, అధికారులకు సమాచారం అందించాడు. ఘటన విషయం తెలుసుకున్న పోలీసులు, హెచ్ఎండీఏ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం సాంకేతిక నిపుణులను పిలిపించి లిఫ్ట్‌ను తెరిచే ప్రయత్నాలు చేపట్టారు. దాదాపు రెండు గంటలకు పైగా లిఫ్ట్‌లో ఉండాల్సి రావడంతో రాహుల్ తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు తెలిసింది. చివరకు సిబ్బంది ప్రత్యేక చర్యలతో లిఫ్ట్ తలుపులు తెరిచి అతడిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి గాయాలు జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటన అనంతరం స్థానికులు స్పందిస్తూ స్కైవాక్‌లోని లిఫ్ట్‌ల నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తారు. తరచూ తనిఖీలు నిర్వహించి సాంకేతిక లోపాలను వెంటనే సరిచేయాలని కోరారు. ప్రజలు ఎక్కువగా వినియోగించే ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే వ్యవస్థను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు గల ఖచ్చితమైన కారణాలపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

## విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

### ఎన్‌టీఏను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



**చేవెళ్ల చేవెళ్ల, జూన్ 12 (జనంసాక్షి)** జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో చోటుచేసుకుంటున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)పై విద్యార్థులు, తల్లిదండ్రులు విశ్వాసం కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. ఎన్‌టీఏను రద్దు చేసి వైద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కోరారు. రీ-నీట్ పరీక్ష నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడితే, దానిని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర సంస్థతో నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని, లేకుంటే దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మూసాపేట్ గౌడ సంఘం రూ.10 లక్షల విరాళం



**కూకట్ పల్లి జూన్ 12(జనంసాక్షి ):** మూసాపేట్ గడిగుట్ట మైసమ్మ ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఎల్లమ్మ తల్లి దేవాలయానికి మూసాపేట్ గౌడ సంఘం తరపున రూ.10 లక్షల విరాళం అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలి విడతగా రూ.5 లక్షలను గుడి కమిటీ చైర్మన్ ఐలయ్య, కేబుల్ శీనన్న, బిక్షపతి, రామచంద్ర సింగ్‌లకు అందజేశారు. మిగిలిన రూ.5 లక్షలను ఈ నెల 30లోపు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, మరింత మంది భక్తులు, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని గౌడ సంఘం ప్రతినిధులు కోరారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

### ప్రభుత్వం స్పందించకపోతే సచివాలయం ముట్టడిస్తాం

### జీవో 7 రద్దు, 8, 9 జీవో వల్ల విద్యార్థుల జీవితాలు పెనం పై నుండి పోయిల పడ్డట్టే

### బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

**ముషీరాబాద్, జూన్ 12 (జనం సాక్షి) :** ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రోజుకొక కొత్త జీవో తీసుకొస్తూ విద్యార్థులను గంధరగోల పరుస్తున్నారని, ఫీజులు రియంబర్స్మెంట్ పై తక్షణమే ప్రభుత్వం స్పందించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం జీవో నం. 7 ను రద్దుచేసి జీవో 8, 9 లను తీసుకొచ్చిందని, ఈ జీవోల వల్ల విద్యార్థులకు కించెత్తు ప్రయోజనమైనా లేకపోగా బీసీ విద్యార్థుల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ చందంగా తయారైందన్నారు. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని ఎలాగైతే సంపూర్ణంగా అమలు చేశారో ఆ పాత పద్ధతిలోనే ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయాలని బీసీ సమాజం డిమాండ్ చేస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యహరిస్తు రాష్ట్రంలోని 14 లక్షల మంది పేద విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతుందని తీవ్రంగా మండిపడ్డారు. గత నాలుగు సంవత్సరాల బకాయిలు విడుదల చేయని చేతకాని ప్రభుత్వం, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి మాత్రం భవిష్యత్తులో ఫీ రియంబర్స్మెంట్ నిధులు విద్యార్థుల ఖాతాలోనే జమ చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై కౌన్సిలింగ్ తేదీలు ప్రకటించినప్పటికీ, ఫీజుల రియంబర్స్మెంట్ విషయంలో ప్రభుత్వం ఇంకా గందరగోళ పరిస్థితులు సృష్టిస్తుందని అన్నారు. ర్యాంకు నిబంధన లేకుండా మొత్తం ఫీజులను ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని, జాప్యం చేయకుండా ఫీజుల బకాయిలు విడుదల చేయాలని లేని పక్షంలో రెండు మూడు రోజుల్లోనే వేలాదిమంది విద్యార్థులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



## సప్లై చైన్ వ్యవస్థకు వెన్నుముకలాంటి ఆర్యవైశ్యులు

### తెలంగాణ సమాజంలో ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర

### ఆర్యవైశ్య ప్రజా ప్రతినిధులను సన్మానించిన

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**హయత్ నగర్, జూన్ 11 (జనం సాక్షి) :** తెలంగాణ సమాజం, ఆర్థిక వ్యవస్థలో ఆర్యవైశ్యుల పాత్ర అనన్య సామాన్యమైనదని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలోని కిరాణాదుకాణం నుంచి మహానగరాల్లో భారీ పరిశ్రమలు నడిపే దాకా తమదైన పాత్ర పోషిస్తూ, సప్లై చైన్ కు వారు వెన్నుముకలా నిలుస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ చంపాపేట్ లో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో అభినందన సత్కారం, సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే బీగాల గణేశ్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి లు హాజరయ్యారు. రాష్ట్రంలో మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఆర్యవైశ్యులను ఈ సందర్భంగా సన్మానించారు. ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులంతా ప్రజాసేవను గొప్పవరంగా భావించాలని ఎమ్మెల్యే సూచించారు. వ్యాపార ధర్మం పాటించటంలో, లాభాలను సమాజ శ్రేయస్సుకు వెచ్చించటంలో ఆర్యవైశ్యులు ముందుటారని మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తూ, రాష్ట్ర సంక్షేమ పథకాల అమలుకు పరోక్షంగా అందిస్తున్న తోడ్పాటును ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఆర్యవైశ్యుల్లోనూ అనేక మంది పేదలున్నారని, వారి సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.



## బీఎల్‌ఏల అవగాహన శిక్షణ సదస్సు

### పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

**నిజాంపేట్ జూన్ 12 (జనంసాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని కొంపల్లి ఎస్ఎన్ఆర్ గార్డెన్ లో టీపీసీసీ ఆధ్వర్యంలో అవగాహన శిక్షణ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఈ బిఎల్ఎ శిక్షణ కార్యక్రమ ఇంచార్జ్ ఎం ఏ ఫహీమ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ పార్టీ బలోపేతనికి, ఎన్నికల ప్రక్రియ సమర్థ నిర్వహణలో బూత్ స్థాయి ఏజెంట్ల ( బి ఎల్ ఎ) పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నాను. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చాను, ప్రతి బూత్ స్థాయి లో ఉన్నటువంటి ఏజెంట్లు సర్ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని నకిలీ ఓటర్ల తొలగించే విధంగా అధికారులతో సమన్వయం చేసుకుంటూ బూత్ లెవెల్ ఆఫీసర్ తో కలిసి క్షేత్ర స్థాయి లో పనిచేయాలని పిలుపునిచ్చారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ శిక్షణ సదస్సులో స్థానిక ఇన్చార్జ్ హనుమంత్ రెడ్డి కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు భూపతి రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి , కిషోర్ రెడ్డి, మైపాల్ రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు,స్థానిక డివిజన్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను పరామర్శించిన శంభీపూర్ క్రిష్ణ



**నిజాంపేట్, జూన్ 12 (జనంసాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ గాగిల్లాపూర్ తాండ దుండిగల్ తండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జగన్ నాయక్ ఊపిరి తితులకు సంబందించిన వ్యాధితో బాధ పడుతున్నారు, అదేవిధంగా కిడ్నీ ఊపిరితూతులకు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కాట్రోత్ లక్ష్మణ్ నాయక్ గార్లని మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్ తో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పరామర్శించారు. వారు మాట్లాడుతూ అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. అనంతరం కిడ్నీ బాధితులు అయినా లక్ష్మిబాయి ఫకీరా రాజు ను వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రజలు సమస్యలు తెలియజేస్తూ అక్కడ ఉన్న ప్రధాన సమస్య వాయు కాలుష్యం, కలుషితమైన నీళ్ల కారణంగా, తాండ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రజలకు మంచినీళ్లు సౌకర్యం కల్పించి ఆదుకోవాలనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ప్రెసిడెంట్ అమర్ సింగ్ నాయక్, వెంకటేష్ నాయక్, ప్రవీణ్ నాయక్, హనుమంతు, నర్సింగ్ నాయక్, కుమార్ నాయక్, రాజు నాయక్, వాసు నాయక్, పటేల్ రెడ్యా నాయకులు పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్‌కు విద్యార్థుల మద్దతు

**కూకట్‌పల్లి జూన్ 12(జనంసాక్షి):** జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి గారి కార్యాలయంలో ఇటీవల జరిగిన ధర్నా ఘటనను విద్యార్థుల తరపున ఖండిస్తున్నాము. విశ్వవిద్యాలయ అభివృద్ధి, పారదర్శక పరిపాలన, విద్యార్థుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషికి మా పూర్తి మద్దతు తెలియజేస్తున్నాము. వ్యక్తిగత ప్రయోజనాలతో లేదా అసత్య ఆరోపణలతో విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలను మేము వ్యతిరేకిస్తున్నాము. జేఎన్‌టీయూహెచ్‌లో క్రమశిక్షణ, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణకు పరిపాలన తీసుకునే చర్యలకు విద్యార్థి సమాజం అండగా ఉంటుంది. విశ్వవిద్యాలయ గౌరవం, విద్యార్థుల భవిష్యత్తు, విద్యా విలువలను కాపాడేందుకు వైస్ ఛాన్సలర్ గారు చేపడుతున్న కార్యక్రమాలకు మా సంపూర్ణ మద్దతు కొనసాగుతుంది.



# గిరిజనులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక అభివృద్ధి- సవాళ్లు దాదాపు ఒకే రూపంలో ఉన్నాయి

### మధ్యప్రదేశ్ గవర్నర్ సలహాదారు దీపక్ ఖండేకర్

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** గిరిజన సంస్కృతి, జీవన విధానాల పరిరక్షణతో పాటు వారి సమ్మిళిత అభివృద్ధికి విద్యాసంస్థలు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో కృషి చేయాలని మధ్యప్రదేశ్ గవర్నర్ సలహాదారు దీపక్ ఖండేకర్ పిలుపునిచ్చారు. గిరిజన సంస్కృతి జీవనవిధానం-సమస్యలు మరియు పరిష్కారాలు అనే అంశంపై శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లోని రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ సెమినార్ హాల్లో రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా నిర్వహించారు. సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు ముఖ్య వక్తగా దీపక్ ఖండేకర్ హాజరై మాట్లాడారు. మధ్యప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలలో గిరిజనులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక అభివృద్ధి మరియు సవాళ్లు దాదాపు ఒకే రూపంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇటువంటి జాతీయ సదస్సుల ద్వారానే గిరిజన అభ్యున్నతికి అవసరమైన విధానపరమైన చర్చలు, సార్థక జోక్యాలు ముందుకు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో కొత్తగా స్థాపించబడిన సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం "విద్య -- వివేకం -- వికాసం" అనే తాత్విక భావనలతో, గిరిజన భాషలు, సంస్కృతి పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. ఇప్పటికే




ములుగు జిల్లా గిరిజన సమాజాలపై వర్సిటీ పలు పరిశోధనలు చేసిందని, వారి ఉపాధి, ఆరోగ్యాల కోసం కమ్యూనిటీ హెల్త్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోర్సులను కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. జాతీయ కన్వీనర్ కె. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని గిరిజన సమాజాల మధ్య ఐక్యతను, సామాజిక సమగ్రతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొఫెసర్ పొలిగొండ సుబ్బాయ చారి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న భిన్నమైన సమస్యలను విశ్లేషించారు. జాతీయ జీవనోపాధి కార్యక్రమాలను బలోపేతం చేయాలని, గిరిజన సంక్షేమంలో అటవీ శాఖ భాగస్వామ్యం మరింత పెరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ ఎం. ప్రభాకర్ వందన సమర్పణ చేశారు.



## స్మశాన వాటిక సమస్యలు పరిష్కరించాలి

### మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన రామ్ ప్రదీప్

**కాప్రా, జూన్ 12 (జనం సాక్షి ) :** మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని శుక్రవారం బీజేపీ హెచ్‌బీ కాలనీ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని సుమారు 20 కాలనీల ప్రజలు ఉపయోగిస్తున్న లక్ష్మీ నగర్ శ్మశానవాటికను ఆధునికీకరించాలని కోరుతూ, మల్కాజిగిరి ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ ఇచ్చిన లేఖను కమిషనర్ కి అందజేశారు. ఈ సందర్భంగా రామ్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా లక్ష్మీ నగర్ శ్మశానవాటికలో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## మణికొండ, నేక్నాంపూర్ సమస్యలపై అధికారులకు ది సిటిజన్స్ కౌన్సిల్ వినతి

**రాజేంద్రనగర్,జూలై12(జనంసాక్షి) :** మణికొండ, నేక్నాంపూర్ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఏర్పడిన ప్రజా సమస్యలను ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు బి. ఉపేంద్రనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మొహమ్మద్ జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సిఎంసీ కమిషనర్ సృజన, ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఎం. నారాయణ అమిత్ ను, కలిసి పలు కాలనీల్లో ఉన్న డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, వరద ముంపు, పార్కుల అభివృద్ధి వంటి సమస్యలను వివరించారు. అనంతరం ఎలక్ట్రికల్ ఇంజనీర్ శిరీషను కలిసి వీధి దీపాల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా అత్యవసర చర్యలు చేపట్టాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న పనులకు అవసరమైన అనుమతులు మంజూరు చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

## మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి మానవత్వం

### అనాథలైన చిన్నారులకు ఆర్థిక సాయం

**కాప్రా జూన్ 12 (జనంసాక్షి) :** డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ సాయిలోక్ కాలనీలో ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన చిన్నారులను కమలానగర్ స్ఫూర్తి లయన్స్ క్లబ్ ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి పరామర్శించారు. చిన్నారుల నివాసానికి వెళ్లి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు లేని లోటు పూడ్చలేనిదైనప్పటికీ, అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని చిన్నారులను ఓదార్చారు. ఈ సందర్భంగా చిన్నారుల తక్షణ అవసరాల నిమిత్తం వారు రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఈ చిన్నారులకు భవిష్యత్తులో విద్యా, వైద్య పరంగా ఎలాంటి అవసరాలు వచ్చినా తాము సిద్ధంగా ఉంటామని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తామని భరోసా




ఇచ్చారు. సమాజంలో ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఎంఎం రాజు, భాస్కర్ రెడ్డి, కరిపే ప్రవీణ్, వంజరి మధు, కాలనీ వాసులు ప్రకాష్, శ్రీనివాస్, సురేష్, రాణి, అంజయ్య, నాగరాజు, నరసమ్మ, రాజేష్, ఉమేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారుల వేగవంతమైన స్పందన

ఉప్పల్, జూన్ 12 (జనం సాక్షి): బీరప్పగడ్డ డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యల పరిష్కారానికి స్థానిక కాంగ్రెస్ నాయకుల చొరవకు అధికారులు సానుకూలంగా స్పందించారు. పిస్తా హౌస్ నుంచి ఉప్పల్ మండీ మార్కెట్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై వేగనియంత్రణ గుట్టలు ఏర్పాటు, దెబ్బతిన్న మురుగునీటి మూతల మరమ్మతులు, గుంతలు పూడ్చివేత, విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఇర్షాద్ ఖాన్ ఉప్పల్ జోన్ కమిషనర్ రాధికా గుప్తాను కలిసి వినతిపత్రం సమర్పించారు.

పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నారని, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ కారణంగా ట్రాఫిక్ మళ్లింపుతో వాహనాల రద్దీ పెరిగి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలం కారణంగా రహదారిపై ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న మురుగునీటి మూతలు, అధిక వేగంతో వాహనాలు దూసుకెళ్లడం వల్ల ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని వివరించారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ రాధికా గుప్తా సమస్యల తీవ్రతను గుర్తించి సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదేశాల మేరకు బీరప్పగడ్డ డివిజన్ సహాయ ఇంజినీర్ రాజ్‌కుమార్, పనుల పరిశీలకుడు కేదార్‌లు ఇర్షాద్ ఖాన్ సమక్షంలో సంబంధిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. రహదారిపై గుంతలు, దెబ్బతిన్న మురుగునీటి మూతలు, వర్షపు నీటి నిల్వలు తదితర సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అవసరమైన ప్రాంతాల్లో వేగనియంత్రణ గుట్టల ఏర్పాటు, గుంతలు పూడ్చివేత, మురుగునీటి మూతల మరమ్మతులు, హెచ్చరిక ఫలకాలు ఏర్పాటు, విద్యార్థుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎం. పరమేశ్వర్ రెడ్డి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. సమస్యపై వెంటనే స్పందించిన కమిషనర్ రాధికా గుప్తా, సహాయ ఇంజినీర్ రాజ్‌కుమార్, పనుల పరిశీలకుడు కేదార్‌లకు స్థానికుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మొహ్సిన్, ఆసిఫ్, పవన్, కిట్టు, దత్తు తదితరులు, వివిధ పాఠశాలల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## మున్సిపల్ భూమి ఆక్రమణపై కౌన్సిలర్‌లు కమిషనర్‌కు ఫిర్యాదు

**తాండూరు జూన్ 12( జనంసాక్షి) :** మున్సిపల్ పరిధిలోని మాల్రెడ్డిపల్లి శివారులో సర్వే నెం.52లో గల మున్సిపల్ భూమి అక్రమ ఆక్రమణకు గురవుతోందని వార్డు నెం.6 కౌన్సిలర్ బి. అనిల్ కుమార్ తో కౌన్సిలర్ లు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ కౌన్సిలర్ లు మాట్లాడుతూ మాల్రెడ్డిపల్లి శివారు సర్వే నెం.52లో మొత్తం ఎకరాల 13-12 గుంటల భూమిని మున్సిపల్ కౌన్సిల్ తాండూరు యాజమాన్యానికి చెందినది. ఈ భూమిని మున్సిపల్ నంబర్ రిజిస్టర్ సెల్ డీ నెం.202/1964, తేదీ 05-06-1964 ద్వారా కౌన్సిల్‌కు చేర్చారు.మున్సిపల్ భవనాలు, విద్యుత్ శాఖ, రాఘవేంద్ర కాలనీ అభివృద్ధి కోసం ఈ భూమిని వినియోగించాల్సి ఉంది. ప్రస్తుతం మున్సిపల్ రికార్డుల ప్రకారం ఇది మున్సిపాలిటీ యాజమాన్యంలోనే ఉంది.ఇటీవల కొందరు వ్యక్తులు, సంస్థలు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు, అనుమతులు లేకుండానే ఈ భూమిని ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నారని కౌన్సిలర్ పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అభ్యంతరం వ్యక్తమవు తోందని తెలిపారు.సర్వే నెం.52 భూమిని తక్షణమే అధికారిక సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ భూమికి స్పష్టమైన హద్దులు నిర్ణయించి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా ఆస్తిని రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ విషయంపై అత్యవసరంగా స్పందించి మున్సిపల్ ఆస్తిని ఆక్రమణదారుల నుండి రక్షించాలని వార్డు నెం.6 ప్రజలు, కౌన్సిలర్ అనిల్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్‌లు తదితరులు ఉన్నారు.

## విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను, నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలి
- మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్‌రెడ్డి



**తాండూరు జూన్ 12(జనంసాక్షి) :** వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారం భమైన సందర్భంగా గురువారం తాండూర్ పట్టణంలోని ప్రభుత్వ కన్య పాఠశాల (హైస్కూల్) రీఓపెనింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు.పాఠశాలకు విచ్చేసిన విద్యార్థినులకు ప్రజాప్రతినిధులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను మరియు నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్‌తో పాటు స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి , సర్ కన్వీనర్ కర్ణం పురుషోత్తం రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- తింసాన్ పల్లి గ్రామంలో జోరుగా పారిశుద్ధ్య పనులు
- తింసాన్ పల్లి గ్రామ సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్



**పెద్దేముల్ జూన్ 12(జనంసాక్షి) :** గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన పరిస్థితులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తింసాన్‌పల్లి గ్రామ సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్ అన్నారు.గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కార రహితంగా ఉన్న మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు.శుక్రవారం సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్, ఉపసర్పంచ్ పల్లె ముకుంద ఆధ్వర్యంలో గ్రామంలోని హనుమాన్ మందిరం నుంచి వాగు వరకు ఉన్న మురుగు కాలువను జేసీబీ సహాయంతో పూర్తిగా శుభ్రం చేయించారు. గత కొన్ని సంవత్సరాలుగా చెట్లు, చెత్తాచెదారంతో నిండిపోయిన కాలువ కారణంగా వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.దీంతో దుర్వాసన,దోమల వ్యాప్తి పెరిగి అంటువ్యాధుల ప్రమాదం కూడా నెలకొంది.ఈ సమస్యను గుర్తించిన సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్ స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ కాలువను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించారు. దీంతో ఇకపై మురుగునీరు సాఫీగా వాగులోకి వెళ్లే అవకాశం ఏర్పడిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. గ్రామాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఉపసర్పంచ్ పల్లె ముకుంద మాట్లాడుతూ భవిష్యత్తులోనూ గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎండీ.హానీఫ్, ఉపాధ్యక్షుడు పల్లె రవీందర్,సీనియర్ నాయకులు బుద్ధారం నాగేష్, పల్లె రాములు, అలీ, లింగేష్, గ్రామ యువకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఫేక్ ఈ-మెయిల్ వ్యవహారం

రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి విచారించారు. పోలీసుల విచారణలో నిందితుడు తీవ్ర ఒత్తిడికి లోనై, తను చేసిన నేరాన్ని అంగీకరిస్తూ స్టేట్మెంట్ ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ విభాగాలు, ఆర్టీఐ పేర్లను దుర్వినియోగం చేస్తూ, నకిలీ మెయిల్స్ పంపడం తీవ్రమైన సైబర్ నేరమని, నిందితుడిపై ఐటీ యాక్ట్, ఫోర్జరీ సెక్షన్ల కింద చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ మొత్తం ఉదంతాన్ని సైబర్ క్రైమ్ పోలీసులు ఇప్పటికే 'సమగ్ర శిక్ష' ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ఈ ఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వ్యక్తిని ఒక బాధ్యతాయుతమైన ప్రభుత్వ విద్యాసంస్థ పరిధిలో ఇండస్ ఏజెన్సీ ఎలా కోఆర్డినేటర్‌గా కొనసాగిస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. నిందితుడిని తక్షణమే విధుల నుండి తొలగించి, ఇండస్ ఏజెన్సీ యాజమాన్యంపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం వొకేషనల్ ట్రైనర్స్ వర్గాల్లో ఈ కేసు తదుపరి పరిణామాలు తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.

## సాంకేతిక వ్యవసాయానికి అగ్రి వర్సిటీ దిక్సూచి కావాలి

పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య విశ్వవిద్యాలయం 62 ఏళ్ల ప్రగతిని వివరించారు. ఉత్తమ రైతులు, శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బంది, ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించారు. డాక్టర్ వైఎస్ఆర్-కేవీపీ ఫౌండేషన్ తరఫున రూ.21 లక్షల విరాళాన్ని విశ్వవిద్యాలయానికి అందజేశారు. అనంతరం హెచ్ఎండీఏ సహకారంతో పునరుద్ధరించిన కిద్వాయ్ కాటేజీ రిసార్ట్ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, బెంగళూరు ప్రొఫెసర్ మధురా స్వామినాథన్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, హార్టికల్చ ర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డి. రాజిరెడ్డి, వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉపకులపతి జ్ఞాన ప్రకాష్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. జి.ఈ.సి.హెచ్. విద్యాసాగర్ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, రాములు నాయక్‌లు పాల్గొన్నారు.

## భట్రాజు సంఘం ఎన్నికలపై కోర్టులో కీలక పిటిషన్



**ఖైరతాబాద్, జూన్ 12 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘంలో ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర, జిల్లా స్థాయి ఎన్నికలను నిలిపివేయాలని కోరుతూ సిటీ సివిల్ కోర్టు, హైదరాబాద్‌లో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది పాక నవీన్ బాబు, పిటిష నర్ ఓంకారం సంతోష్ రాజు తరఫున ఓ.పి.నెం. 31/2026 పిటిషన్‌ను దాఖలు చేసినట్లు తెలిపా రు.సంఘంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషన్‌లో పలు కీలక అంశాలను ప్రస్తావించారు.భట్రాజు సంఘం నియమావళి, బైలాస్‌కు విరుద్ధంగా ఎన్నికలు నిర్వ హిస్తున్నారని ఆరోపించారు.జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటులో సంబంధిత జిల్లాలకు చెందని వ్యక్తు లను సభ్యులుగా చేర్చడమే కాకుండా, వారినే జి ల్లా అధ్యక్షులుగా ఎన్నుకోవడం ద్వారా నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని పేర్కొన్నారు.సంఘ ని బంధనల ప్రకారం ఆయా జిల్లాలకు చెందిన సభ్య లు మాత్రమే ఆ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ చేసే అర్హత కలిగి ఉంటారని, ఇతర జిల్లాలకు చెందిన వారిని ఎన్నిక చేయడం సభ్యుల హక్కులను ఉ ల్లంఘించడమేనని న్యాయవాది పాక నవీన్ బాబు తెలిపారు. ఈ నేపథ్యంలో సంఘ ఎన్నికల్లో చోటు చేసుకుంటున్నట్లు పేర్కొన్న అక్రమాలపై సమగ్ర వి చారణ జరిపి, ప్రస్తుత ఎన్నికల ప్రక్రియను తక్షణ మే నిలిపివేయాలని కోర్టును కోరినట్లు ఆయన వెల్లడించారు.ఈ పిటిషన్‌పై కోర్టు విచారణ జరప నుంది.

## పేదల జనగణన విస్మరించడం రాజ్యాంగ విరుద్ధం!




**మల్కాజిగిరి :** సర్కిల్ పరిధిలోని కుంట్లూరులో ఉన్న రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేస్-3లో నివసిస్తున్న పేదలకు జనగణన చేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమని, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ అందోజు రవీంద్రా చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా అక్కడ గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న సామాన్య ప్రజలను, రాజ్యాంగబద్ధంగా జరుగుతున్న జనగణన ప్రక్రియలో విస్మరించడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ మాతుర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. దేశ పౌరులుగా ఆ పేదలకు దక్కాల్సిన కనీస గుర్తింపును దూరం చేయడం సరికాదని వారు అధికారులకు వివరించారు. వెంటనే ఒక ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేస్-3 లోని గుడిసె వాసులందరికీ సమగ్రంగా జనగణన నిర్వహించి, వారిని ప్రభుత్వ లెక్కల్లోకి తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను వారు కోరారు.